## క్లుప్తంగా

### బాజీ బాబా దర్గాలో భక్తులకు అన్నదానం



పెదకాకాని: స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సహకారంతో సోమవారం అమావాస్య పురస్కరించుకుని రాత్రి పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు పెదకాకాని మండల సర్వసభ్య సమావేశం

పెదకాకాని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, చేపట్టాల్సిన పనులపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన సూచించారు. గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

### అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

పెదకాకాని: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మినీ ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఆదివారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో వాహన తనిఖీలు చేపట్టారు. మండలంలోని గోళ్లమూడి గ్రామ శివార్లలో వాహనంలో ఉన్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న కుంభా ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఫిరంగిపురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు సోమవారం సీఐ బందారు సురేష్‌బాబు తెలిపారు.

### సీఐ రామారావుకు ఘన నివాళి



పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామానికి చెందిన నెల్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోగుల మూడి రామారావు ఆదివారం నెల్లూరులో గుండెపోటుతో మరణించారు. సోమవారం మన్నవ గ్రామంలోని స్వగృహంలో ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, పోలీసు అధికారులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

### రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనటంతో ఆరుగురికి గాయాలైన సంఘటన చేబ్రోలులో ఆదివారం రాత్రి జరిగింది. చేబ్రోలు కొత్తపేట ప్రాంతంలో గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. యువకులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. జీబీసీ మెయిన్‌రోడ్డు సెంటర్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనటంతో షేక్ అబుద్‌ల్ రెహమాన్, షేక్ షాహిద్, షాబీర్, ఇర్ఫాన్, పఠాన్ పజిల్, షేక్ రియాజ్‌లకు కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. బాధితుల్ని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు నగరంలో ఐక్యత విజయపథం యాత్ర

నెహ్రూనగర్: పేదరికం నుంచి పేద జన విముక్తే ధ్యేయంగా, ఐకమత్యమే లక్ష్యంగా మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐక్యత విజయపథం యాత్ర నేడు నగరంలోకి రానున్నట్లు దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి విల్సన్ తెలియజేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఐక్యత విజయపథం యాత్ర కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఏసీ కాలేజీ వరకు భారీ ర్యాలీ అనంతరం అక్కడి ఓపెన్ ఆడిటోరియంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బండ్లమూడి స్టాలిన్ బాబు, వంక దొర శ్రీనివాస్, మేళం సునీల్ ప్రకాష్, నరేంద్ర సుధాకర్ పాల్గొన్నారు.

# షుగర్‌తో బీ కేర్‌ఫుల్

- వ్యాధి బారిన పడుతున్న పిల్లలు, యువత
- ఆధునిక జీవన శైలితో పెరుగుతున్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధికి చెక్


బాల్యం తియ్యని జ్ఞాపకంగా ... ఆడుతూ పాడుతూ బడికెళ్లాల్సిన ఎందరో బాలలు నేడు చక్కెర వ్యాధి బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ కుటుంబానికి అండగా నిలవాల్సిన పలువురు యువకులు సైతం వ్యాధి బారిన పడి, అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. భారతదేశంలో షుగర్ వ్యాధి బాధితులు పది కోట్ల మంది ఉండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీని బారిన పడకుండా కాపాడుకోవచ్చు. మధుమేహంపై అవగాహన కోసం ఏటా నవంబర్ 14న ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. – గుంటూరు మెడికల్




పిల్లలు, యువతలో మధుమేహం రావడానికి ప్రధాన కారణం ఇన్‌ఫెక్షన్లు. శరీరంలో ప్యాంక్రియాస్ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇన్‌ఫెక్షన్ వల్ల అది దెబ్బతిని ఇన్సులిన్ ఉత్పత్తి అవ్వకపోవడంతో వ్యాధి సోకుతుంది. పుట్టుకతో వచ్చే జన్యుపరమైన కారణాలు, జంక్ ఫుడ్, వ్యాయామం లేకపోవడం, బరువు పెరగడం, స్థూలకాయం, మానసిక ఒత్తిడికి గురవ్వడం వల్ల కూడా సోకుతుంది. పెద్దవారి జీవన శైలిలో మార్పులు, వ్యాయామం లేకపోవడం, ఆహారంలో మార్పులు ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, అధిక బరువు, ఒత్తిడి వంటి కారణాలతో సోకుతుంది.

**వ్యాధి లక్షణాలు**

- తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లడం
- తరచుగా దాహం వేయడం
- ఆకలి పెరగడం
- బరువు తగ్గిపోవడం, నీరసం, నిస్సత్తువ,
- పిల్లలు రాత్రి వేళల్లో పక్క తడపటం.
- ఈ లక్షణాలు పిల్లల్లో గమనిస్తే తక్షణమే తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించి జీవితాంతం ఇన్సులిన్ వాడాలి.
- నోటి ద్వారా తీసుకునే మందులు పిల్లలకు ఉండవు.



**జిల్లాలో బాధితులు**

జిల్లాలో 50 మంది షుగర్ వ్యాధి నిపుణులు, 120 మంది పిల్లల వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతి నెలా ఒక్కో వైద్యుడి వద్దకు మూడు నుంచి ఐదుగురు చిన్నారులు చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే చేయగా 5,41,123 మంది పెద్దవారు వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. వీరి పిల్లలకు కూడా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించి, జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడవచ్చు.

### జాగ్రత్తలతో షుగర్ కట్టడి



మధుమేహాన్ని తగు జాగ్రత్తలతో రాకుండా నివారించవచ్చు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే తక్షణమే వైద్యుల్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. ప్రతి రోజూ శారీరక వ్యాయామం చేయాలి. నిర్ణీత వేళకు పోషకాహారం, మితాహారం తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్స్‌ను, ఒత్తిడిని దరిచేరనీయవద్దు. కంటికి సరిపడా నిద్ర ఉండాలి. నూనె వస్తువులు, ఉప్పు తగ్గించి తీసుకోవాలి. స్వీట్లు, కూల్‌డ్రింక్స్, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్స్ లాంటి షుగర్ ఎక్కువగా ఉండేవి తినకూడదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

= డాక్టర్ వీవీ రామ్‌కుమార్, మధుమేహవ్యాధినిపుణులు, గుంటూరు

### స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలి



మన దేశంలో షుగర్ వ్యాధి బాధితులు 100 మిలియన్ ఉంటే ప్రీ డయాబెటిస్ అంటే రాబోయే మూడు నుంచి ఐదేళ్లలో చేసే అవకాశం ఉన్నవారు 150 మిలియన్ మంది ఉన్నారు. షుగర్‌తో బాటు 100 మందిలో 30 మందికి అధిక రక్తపోటు( హైబీపీ) ఉంది. ప్రీ డయాబెటిస్ వారు షుగర్‌పై అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరి చేరదు. షుగర్‌తో కిడ్నీలు దెబ్బతింటాయి. హార్ట్ ఎటాక్ , బ్రెయిన్ స్ట్రోక్ వస్తోంది. కంటి చూపు కోల్పోతారు. శరీరంలోని ఇతర శరీర అవయవాలు దెబ్బతిని ప్రాణాపాయం సంభవిస్తుంది. ప్రతి ఒక్కరు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్టు, గుంటూరు

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదం కృష్ణలంక పోలీస స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లాలోని వట్లూరు గ్రామానికి చెందిన కుంచె అరుణ(35), గణపతిరావు భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో అరుణ తన చిన్న కుమారుడు శ్యాం బాబుతో కలిసి గుంటూరు జిల్లా నంబూరులోని తన పుట్టింటికి ఆదివారం ఉదయం బస్సులో బయలుదేరింది. మధ్యాహ్నం 3.30 గంటలకు వారధి బస్టాప్ వద్ద బస్సు దిగి నంబూరు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఆమెకు పరిచయమున్న నూతక్కి గ్రామానికి చెందిన తుమ్మపూడి రవి ద్విచక్ర వాహనంపై వారధి మీదుగా తన గ్రామానికి వెళ్తూ ఆమెను గమనించాడు. ఇక్కడ ఎందుకు ఉన్నారని అతను ఆమెను ఆరా తీశాడు. తమను నంబూరు తీసుకెళ్లాల్సిందిగా అరుణ కోరింది. రవి వారిని తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని బయలుదేరగా వారధి చెక్ పోస్టు వద్ద గుంటూరు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కింద పడిపోయారు. అరుణ తల మీదగా లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రవి, శ్యాం బాబు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో గార్మి వేడుకలు



పొన్నూరు: పట్టణంలోని ఇస్లాంపేట ముస్లిం యూత్ ఆధ్వర్యంలో గార్మి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ హజరత్ సయ్యద్ మహబూబ్ సుభాని జండా చెట్టు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ అల్తాఫ్ హుస్సేన్, మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మొహమ్మద్, పట్టణ ముస్లిం యూత్ పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డులో గల విజయశ్రీ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. శిబిరంలో గుండె, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సీఎం జగన్ పాలన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా.. విప్లవాత్మక నిర్ణయాలతో అన్ని వర్గాలకు మేలు జరిగేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణపాలన అందిస్తున్నారని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వై.ఎస్. జగన్ పాలనలోనే సామాజిక న్యాయం, సంక్షేమాభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్ళ పాలనలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా.. అటు సంక్షేమ కార్యక్రమాలు, ఇటు అభివృద్ధి పనులు నిర్విరామంగా కొనసాగించిన సీఎం జగన్ ప్రజల గుండెల్లో బలమైన పరిపాలన నమ్మకాల పునాదిని నాటారన్నారు. అందుకే గడప గడపకూ మన ప్రభుత్వం.. సామాజిక బస్సు యాత్ర.. వై నీడ్స్ ఏపీ జగన్ వంటి కార్యక్రమాలు ఏది చేపట్టిన స్వచ్ఛందంగా ప్రజలు స్వాగతించడంతో పాటు.. విశేష మద్దతు అందిస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా చిన్నారి నుంచి పెద్దల వరకు వారి ఆరోగ్య వివరాలు తెలుసుకుని..మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులు అందజేసి, అవసరమైతే దగ్గర్లోని ఆసుపత్రిలో చికిత్స సైతం చేయిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యా, వైద్యానికి పెద్దపీట వేసి.. నాడు నేడు ద్వారా పాఠశాలల్ని బాగుచేయించడంతో పాటు, ఆరోగ్యశ్రీలో గతంలో లేని విధంగా అనేక జబ్బులను చేర్చి పేదలకు వైద్యాన్ని దగ్గర చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైతం సీఎం జగన్ రాష్ట్ర ప్రజలందరూ మరోమారు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

## చేతిరాతను మార్చుకుని తలరాతలు దిద్దండి

- ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి
- ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్య శిక్షణ తరగతులు



శిక్షణ శిబిరాన్ని సందర్శించిన రవీంద్రనాథ్‌రెడ్డి, ఉప్పాల రామమోహనరావు, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు చేతిరాతను మెరుగుపరచుకుని విద్యార్థుల తలరాతను మార్చాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి–పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 30 మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు క్యాలీగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడి, చేతిరాతను అందంగా మార్చుకోవడంలో తోటి ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావుతో కూడిన వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ బృందం ప్రతి వారం సెలవు దినాల్లో సొంత ఖర్చుతో పాఠశాలలకు వెళ్లి, తోటి ఉపాధ్యాయులకు క్యాలీగ్రఫీలో ఉచితంగా శిక్షణ కల్పించడం ద్వారా వందలాది మంది ఉపాధ్యాయులను, తద్వారా వేలాది మంది విద్యార్థుల చేతిరాతను తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత పెరుగుతాయని సూచించారు.

ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ చేతిరాత సక్రమంగా లేనివారు చదువుతో పాటు ఇతర విషయాలపై ఏకాగ్రత చూపలేరని తెలిపారు. చేతిరాతను అందంగా మలచుకోవడం ద్వారా ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత కుదురుతాయని సూచించారు. చేతిరాత శిక్షణా కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయ మిత్రుల సహకారంతో ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన శిక్షణలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వందనం, జ్యోతికి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు ప్రసాద్, ఈ.అనిల్‌కుమార్, షాజీర్, బురాన్, టి.శ్రీనివాస్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

### జీజీహెచ్‌లో అన్నదానం

గుంటూరు మెడికల్: అన్ని దానాల్లో కన్న అన్నదానం గొప్పదని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. జీజీహెచ్ ఓపీ వద్ద సోమవారం కాంతిలాల్ వినాయక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి అమావాస్య రోజున 300 మందికి పైగా పేద రోగుల సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, నరేంద్రర్, మహావీర్, వేణుగోపాల్ శర్మ, రాం అగర్వాల్ పాల్గొన్నారు.

### దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన అవసరం



గుంటూరు మెడికల్: దీర్ఘకాలం రక్తంలో షుగర్ శాతం అధికంగా ఉండే వారిలో నాడీ కణజాలం దెబ్బతిని 'న్యూరోపతి'కి దారి తీస్తుందని నటరాజ్ హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్, డాక్టర్ పి.నటరాజ తెలిపారు. ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా ఆదివారం ఉదయం ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా బ్రాడీపేట 2/1లోని ఎస్‌హెచ్‌వో భవనంలో మెదడు, నరాల వ్యాధులపై అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సదస్సుకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ నటరాజ మాట్లాడుతూ రక్తంలో అధిక షుగర్ శాతం వల్ల నాడులు దెబ్బతిని కాళ్లు, చేతులు తిమ్మిర్లు, మొద్దు బారడం, మంట పుట్టటం వంటి లక్షణాలు బయటపడతాయన్నారు. దీనినే పెరిఫెరల్ న్యూరోపతిగా పేర్కొంటారని తెలిపారు. అటానమిక్ నాడీ కణాలు కూడా దెబ్బ తినడం వల్ల గుండె, జీర్ణ, మూత్ర వ్యవస్థల పైన తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, మెడికల్ క్యాంప్స్ ఛైర్మన్ టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ సమాజంలో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాల వ్యాధులు పెరిగిపోయానని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ తాతా సేవ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మధుమేహ బాధితుల సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతుందని, చిన్న వయసులోనే పలువురు వ్యాధి బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో మేనేజర్ పి.నిర్మలారాణి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### ఆక్యుపంక్చర్ సైన్స్ జాతీయ ఉపాధ్యక్షుడిగా 'ముంజంపల్లి'



గుంటూరు మెడికల్: ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్(ఆస్పా) జాతీయ ఉపాధ్యక్షుడిగా ముంజంపల్లి శివకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆస్పా భారత్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మాకాల సత్యనారాయణ నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వివిధ రంగాల్లో సేవలందిస్తూ కోవిడ్ సమయంలో ఎంతో మందికి వైద్య సేవలు అందించి, వారి ప్రాణాల్ని నిలబెట్టిన సామాజిక సేవ కార్యకర్త ముంజంపల్లి అని ఎన్నో మెడికల్ క్యాంపులు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ఆక్యుపంక్చర్‌పై విస్తృత ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కాలేజీలు, ఆశ్రమాలు, హాస్పిటల్స్‌తో పాటు వివిధ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నందుకుగాను శివకుమార్‌ను జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించామని మాకాల తెలిపారు. ముంజంపల్లి నియామకంపై పలువురు డాక్టర్లు, ఫార్మసిస్టులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్. సి.ఎస్.రావు హర్షం వ్యక్తం చేశారు.

## నేటి నుంచి అగస్తేశ్వరాలయంలో కార్తిక పూజలు



ప్రత్యేక అలంకారంలో స్వామి

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో గల శ్రీ గంగా పార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా ఈనెల 14నుంచి డిసెంబర్ 12 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు ప్రసన్నాంజనేయశర్మ తెలిపారు. ఆలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో ఆయన మాట్లాడారు. ఈ నెల రోజులు భక్తుల గోత్రనామాలతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటలకు సహస్రనామార్చన, పంచ హారతుల నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని వివరించారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు స్వామికి అభిషేకాలు, అనంతరం అలంకార దర్శనం ఉంటుందని తెలియజేశారు. అభిషేకాల్లో పాల్గొనదలచిన భక్తులు 9441110913లో సంప్రదించాలని సూచించారు. ఈ నెల రోజులు ప్రతిరోజు సాయంకాలం దేవస్థానం ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించనున్నట్లు చెప్పారు. భక్తుల పేరు మీద దీపోత్సవానికి యథాశక్తి నువ్వుల నూనె, ఆవు నెయ్యిను దేవస్థానానికి సమర్పించి కార్తిక దామోదరుడు కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



చిన్నారులకు అన్నదానం చేస్తున్న దాతలు

పెదకాకాని: బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్సన్ తెలిపారు. మండలంలోని నంబూరు యానాది కాలనీలో సోమవారం స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జాన్సన్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని ఏడు రోజుల పండుగగా స్కోప్ ఫౌండేషన్ నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు. మరో అతిథి డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంతో పాటు చదువుపైనా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారులకు నాగార్జున యూనివర్సిటీ మినీ క్యాంటీన్ నిర్వాహకుడు బి.కిరణ్‌కుమార్ సహకారంతో భోజనం, నోటు బుక్స్‌ను అతిథులు పంపిణీ చేశారు. దాత కిరణ్‌కుమార్‌కు స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో షేక్ సల్మా, వరద, ఇందిరమ్మ , ప్రశాంతి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్తిక పూజలకు శివాలయాలు సిద్ధం



ముస్తాబైన కొత్తపేట శివాలయం

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయం కార్తిక శోభ సంతరించుకుంది. మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులు తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ, అధికారులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి ట్రాఫిక్ సమస్య లేకుండా ద్విచక్ర, ఆటో, కార్లు పార్క్ చేసుకునేలా సౌకర్యాలు కల్పించామని ఈవో శివారెడ్డి తెలిపారు. స్వామి దర్శనానంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నగరంలోని అరండల్‌పేట శివాలయం, బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరస్వామి ఆలయం, కొరిటిపాడు శివాలయం, పాత గుంటూరు శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: ఆదరణ కరువైన వృద్ధుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ తెలిపారు. ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించనున్న సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని సమితి కార్యాలయంలో 100 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యంతో పాటు 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మాదాల ప్రకాష్, ఎస్.వి.రమణ, పలకలూరి శివరావు, మురళీ సాయి, పి.రజనీశ్వరరావు, బొగ్గవరపు చిన్నబాబు, పి.లహరి పాల్గొన్నారు.

## పార్కులో విధ్వంసానికి పాల్పడిన వారిపై కేసు

పట్నంబజారు: పార్కులో ఆకతాయిలు విధ్వంసానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ పార్కులోని మదర్స్ ఫీడింగ్ రూంలో కొంతమంది ఆకతాయిలు ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయంలో లైట్లు, బోర్డులు, ధ్వంసం చేశారు. దీనిపై అధికారులు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**షాపులో చోరీ**

షాపులో చోరీపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. భారత్‌పేట 3వ లైనులో మేడిశెట్టి కమలేష్ పుస్తకాల షాపు నిర్వహిస్తుంటారు. ఈనెల 9న ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లగా షట్టర్ తాళాలు పుగులగొట్టి ఉన్నాయి. షాపులోకి వెళ్లి పరిశీలించగా రూ. 2,500 చోరీకి గురైనట్లు గుర్తించి, సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.